# రంగులు

"హల్లో మ్యారేజిబ్యూరోయేనా?"

"అవునండి"

నమస్కారం, నాపేరు సుబ్బారావు, కమ్మవాళ్ళం ఊరు కోదాడ. మా అమ్మాయికి ఓ సంబంధం చూడాలి.

"చెప్పండి"

| | |
|---|---|
| అమ్మాయి పేరు | : శిరీష |
| వయస్సు | : ఇరువై రెండు |
| ఎత్తు | : ఐదు ఐదు |
| చదువు | : ఎం.ఎ. యింగ్లీష్ |
| రంగు | : తెలుపు |
| అభిరుచులు | : ఆటలు పాటలు, సాహిత్యాన్ని చదవడం |

"అన్ని విధాల తగిన వాడైతే కట్నం బ్లాంక్ చెక్. స్టేట్స్‌లో వున్న వాళ్ళకు ప్రాధాన్యత, వెంటనే పెళ్ళి చేయాలనుకుంటున్నాం. మా ఫోన్ 498 మీరు కోరినంత ఫీ, పర్టికులర్స్ రాసుకున్నారు కదా. యివి వుంచండి" అంటూ కొంత డబ్బును అక్కడ వుంచి లేచాడు సుబ్బారావు.

"స్టేట్స్‌లోనే ఓ వరుడున్నాడు మీ కులం వాడే ఈ వివరాలు ఫాక్స్‌లో పంపిస్తాం అక్కడి నుండి రెస్పాన్స్ వస్తే వెంటనే తెలియపరుస్తాం. ఒకే " అంటు అక్కడున్న నోట్లను తీసుకుని వివరాలు నమోదు చేయడానికి రిజిష్టర్ తెరిచాడు.

"మరిక వస్తానండి" అంటు సుబ్బారావ్ ఆఫీసు బయటికి నడిచాడు.

00

ఫోన్ రింగయ్యింది

"హల్లో"

"సుబ్బారావ్ గారా"

"మాట్లాడుతున్నా"

"శుభం మీ అమ్మాయికి ఓ మంచి సంబంధం"

"థాంక్స్ సార్"

"మీ కులపువాళ్ళే, అమెరికాలో వుంటున్నారు. మన దగ్గర వండ్ల తోటలున్నాయి. మద్రాసులో వజ్రాల ఎగుమతి వ్యాపారం. ఒక్కడే కొడుకు. పేరు అరేన్ రావ్, ఎంబిఏ. ఎత్తు రంగు అన్నీ సరిపోతయి, చూస్తారుగ వజ్రపుముక్క వచ్చేవారం ఇండియా వచ్చి ఓ నెల యిక్కడుంటారట ఓడేట్ చెపితే పంపిస్తాను."

"సరే వచ్చినాక, ఒక రోజు ముందు ఫోన్ చేయండి"

"ఒకే వుంటానండి" అంటూ ఫోన్ పెట్టేశాడు.

00

కోదాడ బస్‌స్టేషన్ ఎదుటి వీధి వైపు మారుతి జెన్ మళ్ళింది. అందరి చూపులు దాని వెంటే వున్నాయి. ఆ కారు నేరుగ వెళ్ళి సుబ్బారావు యింటి ముందాగింది వాకిట్లో నిలుచున్న సుబ్బారావ్ ఆయన భార్య దేవకి నలుగురైదుగురు బంధువులు ఎదురెళ్ళి వాళ్ళను సాదరంగా లోపలికి తీసకెళ్ళారు.

"నేను అరేన్ రావ్, వీరు మా అమ్మగారు" అంటూ అందరికీ చేతులు జోడించి నమస్కరించాడు. ఫుల్ సూట్‌లో మెరిసిపోతున్నాడు.

"నా పేరు జానకి" అంటు నమస్కరించింది తల్లి చేతులకు రవ్వలు పొదిగిన బంగారు గాజులు మెడలో అవె రంగురాళ్ళు పొదిగిన నెక్‌లెసు ధరించిన నడీడు స్త్రీ. ఉన్నతనం పేర్చిన నిండుతనంతో ఎంతో హుందాగా వుంది.

ఇద్దరు చిరునవ్వుతో లోపలికి నడిచి సోఫాలో కూర్చున్నారు. ఈ సంబంధం గురించి తెలిసిన జనం యిల్లంతా నిండుతున్నారు. ఈలోపల కొందరు ఆడపడచులు శిరీషను తోలుకొచ్చి ఎదుటి సోఫాలో కూర్చోపెట్టారు. అప్పుడు ఆ యువతి ముఖంలో మబ్బుచాటు చంద్రుడి వెన్నెలలా నవ్వు కదిలింది.

అరేన్ చూపులు ఆ అమ్మాయి పైన ఆగాయి. అల్లరి చేసే కళ్ళు మల్లెలలాంటి పలువరుస, తాను కలలుకన్న కన్య అనుకున్నాడు. అప్పుడు అతని ముఖంలో ముసురులాంటి సిగ్గు ముంచుకొచ్చింది.

కట్టు, బొట్టు, పుత్తడిబొమ్మ తాము మోసుకొస్తున్న వారసత్వపు అందచందాలు, ముందు తరాల వరకు కొనసాగుతుందన్న నమ్మకం జానకమ్మకు కలుగగానే, కోరుకున్న కోడలు అనుకుంది. అటూ ఇటు మళ్ళుతూ మాట్లాడుతూ వుండడం వల్ల జారుతున్న పైటను సరిచేసుకుంది.

సుబ్బారావు ఆయన భార్య దేవకి కాస్త పక్కకు జరిగి కాబోయే అల్లుని గూర్చి మాట్లాడుకున్నారు. అమెరికాలో వుంటూ అతి నిరాడంబరంగా వున్న తీరు వాళ్ళకు నచ్చింది. అంతకంటె ఆ అబ్బాయి ఆస్తి, అంతస్తు అవన్ని అందర్ని యిష్టపరిచాయి. అంతేగాదు తృప్తిపరిచాయి. వాళ్ళ చూపుల్లో ఆ విషయం స్పష్టంగా కనిపిస్తావుంది.

అప్పటి వరకు తలవంచి కూర్చున్న శిరీష తన కోసం వచ్చి కూర్చున్న వరుని వైపు చూసింది. అతనూ అప్పుడే చూశాడు. యిద్దరి చూపులు కలుసుకున్నాయి మౌనంగా మాట్లాడుకున్నాయి పెదవులు కదిలి మనస్సులోని యిష్టతను ఆవిష్కరిస్తున్నట్లు వాళ్ళ కళ్ళు కదులుతూ వున్నాయి.

ఈ లోపల కాఫీ కప్పులు కదిలాయి. వక్కపొట్లాలు నలిగాయి. చూపుల సైగలు, గుసగుసలకు కనురెప్పలాగి ఊగే తలలు.

ఎవరో ముత్తైద "యిక పదండి పిల్ల పిల్లగాడు మాట్లాడుకోని" అంటూ లేచింది. అందరు అవును అన్నట్టు తలలూపుతూ అక్కడినుండి కదిలారు. జానకి గారు లేచి అమ్మాయిని తీసుకొచ్చి తన కొడుకు పక్కన కూర్చోపెట్టి, తాను దేవకి నిలుచున్న వైపు నడిచింది. కాసేపు మౌనం తరువాత శిరీష వైపు చూస్తు-

"నీపేరు"

"బయోడేటా చూడలేదా, తెలిసి ఎందుకడగడం"

ఆరెన్ ఓసారి కళ్లు మూసి తెరిచాడు తలను కదిలిస్తూ

"నచ్చానా"

"నేను" అంది.

'నచ్చారు' అన్నట్టు కనురెప్పలను నెమ్మదిగా మూసాడు.

"ఎంబిఏ అనుకుంట"

'అవును' అన్నట్టు చూశాడు మామూలుగ

"మీరు ఎం.ఎ. లిటరేచరా"

"అవును" అంది ఓ మాదిరి గర్వం ఉట్టిపడుతువుంటె.

అరెన్ ముసిముసిగ నవ్వాడు.

"స్టేట్స్‌లో వుంటున్నారు కదా మైకల్ జాక్సన్ను చూశారా?" ఎంతో ఆసక్తిగా అడిగింది. అప్పుడామె అప్పుడే వికసించిన పువ్వులా వుంది.

"చూశాను" అన్నట్టు మామూలుగ తల వూపాడు.

"అతనంటే మీ అభిప్రాయం" ఎంతో అభిమానంగా అడిగింది.

"ఏదో పాటలు పాడుతుంటాడు"

"అలా తీసి పారేయకండి అతను మేటి ప్రపంచ పాటగాడు" అంది కాస్త చిన్నబుచ్చుకున్నట్టు చూస్తూ.

'అలాగా' అన్నట్టు చూశాడు నిబ్బరంగా.

"అతని పాటల మాధుర్యం జనం నృత్యం చేస్తున్నారు." అంటు ఆమె తన్మయత్వంతో చెపుతువుంటె అతను మౌనంగా వింటూ వున్నాడు.

"ఆయనన్నా ఆయన పాటలన్నా ఆయన పుట్టి పెరిగిన దేశమన్నా నా కిష్టం. అక్కడ ఫ్రీటాక్, ఫ్రీలుక్, ఆడినా పాడినా అక్కడెవరు పట్టిచ్చుకోరటగ! మీ

బయోడేటాలో స్టేట్స్‌లో వుంటున్నారని చూశాను. లెటజ్ హేవ్ ఫ్రీ లైఫ్" అంటూ అతని చేతిలో చేయి వేసి షేక్ చేస్తున్నపుడు ఆమె ముఖం నవ్వుతో విప్పారింది.

అతను మాత్రం మౌనంలోకి వెళ్లిపోయాడు.

"మాట్లాడరేం అంటు కదిపింది, మళ్ళీ తనే

"పెళ్ళి అయినాక నేను యిక్కడనే వుండాలనుకుంటున్న" ముక్తసరిగ అన్నాడు.

"అబ్బా బోర్ లైఫ్, ఇక్కడ స్త్రీని ఓ మనిషిగ చూడరు. కట్నం తేకుంటే కాల్చేస్తారు, పిల్లలు కాకుంటే వొదిలేస్తారు. చెప్పింది వినకుంటె వెలివేస్తారు. ఏది ఎవరు చూడకుండ భుజం చుట్టు కొంగు కప్పుకోవాలి, బారెడు జుత్తు, జానెడు కొప్పు నో, నో అంతా అన్ సివిలైజ్డ్ కల్చర్, తలవొంచుకొని నడవాలె తప్ప తల ఎత్తి ఎవరిని చూడకూడదు, ఓ నవ్వు నవ్వకూడదు, సంతోషము వ్యక్తపరచకూడదు, పరాయి మొగవాన్ని కన్నెత్తి చూడకూడదు, పలకరించకూడదు అన్నీటికి పట్టింపులు సాధింపులు ఇక్కడి జనానికి కోడలు అంటె పనిమనిషి కంటె పలుచనా!

అరేన్ బిత్తరపోయి వింటున్నాడు, తాను విన్నదొకటి చూస్తున్నదొకటి రెప్పవాల్చకుండ ఆమెనే చూస్తువున్నాడు ఆమె మాటాడుతూనే వుంది.

"ఐ లైక్ ఫ్రీ మూవింగ్ సొసైటీ" అంటూ మోగుతున్న ఫోన్ వైపు నడిచింది.

అన్ ఈజీగా కదులుతూ ఉన్న ఆరేన్‌లో, క్రమశిక్షణ కరిగిపోతున్నట్టు అనిపించింది. 'ఈ దేశంలో బాగా చదువుకున్న ఈ అమ్మాయిలో ఇంత విదేశీ వ్యామోహం పేరుకుపోయిందే! చక్కని సాంప్రదాయక భారతీయ భావాలు ఎందుకు అలవడలేదో, ఈ దేశపు వనితగా సాంప్రదాయ, సంగీత, సాహిత్యాన్ని అలవర్చుకుంటే ఎంతో బాగుండేది' అనుకుంటు లేచి "ఇక వెల్తామండీ" అంటు బైటికి నడిచాడు. అతని వెంట మౌనంగా ఆయన తల్లి నడిచింది. వాళ్ళ వెనకాల మిగతావాళ్ళు కారు వరకు నడిచి మౌనంగా నిలుచున్నారు.

00

కారు కదిలి రోడ్డు వైపు నడుస్తూ వుంది.

"ఈ సంబంధం కుదురుతుందనుకున్న బాబు"

"కుదిరేదే"

"మరి"

"అభిరుచులు కలవటం లేదమ్మ"

"అంటే"

"మనం ఇండియా రావాలనుకుంటుంటే ఆమె అమెరికా పోవాలనుకుంటుంది" అన్నాడు గేర్ మారుస్తూ.

• 1996